# డాడీ

-ఈవేమన

"కాంతం.. కాంతం... చెవికోసిన మేకలా అరుస్తున్నాడు" అప్పారావ్.

"అబ్బబ్బ!... ఎందుకలా కాకిలా అరుస్తున్నారు" వంటగదిలోంచి సమాధానం.

"ఆ... అఘోరించావ్! వేడి కాఫీ కాస్త నా మొహాన పడేయ్"

"చాల్లెండీ సంబడం! వేడి కాఫీ మీ ముఖాన పడేస్తే మీ ముఖం కాస్త కరెంట్ షాక్ తిన్న కాకిలా అయిపోగలదు" అంది.

"అబ్బబ్బ! అతిశయోక్తులాపి పేపరు అందుకో" అన్నాడు అప్పారావ్.

ప్రతిరోజూ పేపరు చదవనిదే టాయ్‌లెట్‌లో కూర్చున్నా తన పని జరగదు. అప్పారావ్ ఓ ప్రైవేట్ కంపెనీలో క్లర్క్‌గా పనిచేస్తున్నాడు. నెలకు తొమ్మిది వేల జీతంలో కటింగ్‌లు పోను ఏడువేల తొమ్మిది వందలు అందుకుంటూ తన సంసార సాగరాన్ని ఈదుతున్నాడు.

అప్పారావ్ పిసినారని అందరూ గొణుక్కుంటుంటారు. కానీ, అతనిది పిసినారితనం మాత్రం కాదు. ముందు జాగ్రత్త! అయినా ఏం లాభం? లోభికి ఖర్చెక్కువ అన్నట్టు జరుగుతోంది.

"ఏమండీ! ఇదిగో కాఫీ" అంటూ అందించింది కాంతం.

"థాంక్యూ" అంటూ కాఫీ అందుకున్నాడు అప్పారావ్.

"ఆ... అన్నట్లు మీ 'హీరోహోండా' కొనే కార్యక్రమం ఎంతవరకు వచ్చింది?" అడిగింది కాంతం.

"ఏముందీ! బ్యాంకు బాలెన్స్ నలభైవేలు దాటింది. ఇదిగో రానున్న ఈ ఉగాదికి కొత్త బండి కొనడం ఖాయం..." అంటూ భరోసా ఇచ్చాడు అప్పారావ్.

తనకు పెళ్ళయిన కొత్తనుంచి భర్త బండి నడుపుతుంటే వెనుక కూర్చొని తన భర్తను వాటేసు కోవాలన్న తన వాంఛ... ఇన్నాళ్ళకు నెరవేరబోతుందని మురిసిపోతూ... జీడిపప్పు ఉప్మా చేసి భర్తకు తిని పించాలని వంట గదిలోకి జారుకుంది కాంతం.

కాస్సేపటికి మళ్ళీ అప్పారావ్ దగ్గరకు వస్తూ... మిమిక్రీ కేసెట్‌లో ఏమండీ! రావుగోపాలరావు గారు మీతో చిన్న మాట అని ప్రభాకరరెడ్డి చెవి కొరికేసినట్లు... ఏదో సీక్రెట్ చెవిలో చెప్పింది కాంతం.

అంతే... అప్పారావ్ నెత్తిన పిడుగు పడినంత షాక్ తిన్నాడు. ఇప్పుడు అప్పారావ్ పరిస్థితి మూలిగే నక్కపై తాటిపండు పడినట్లయింది. దానికి కారణం...

తన ముద్దుల కూతురు పుష్పవతి అయిందన్న ఆ పిడుగులాంటి వార్తే!

ఇంకేముంది హీరోహోండా కొనే ప్రోగ్రామ్ కేన్సిల్ చేస్తూ 'బ్రతుకుజీవుడా' అంటూ రజస్వల కార్యక్రమం పనిలో మునిగిపోయాడు పుష్ప డాడీ.. అప్పారావ్.

పుష్పకు నాన్నంటేే చాలా ఇష్టం. ఎందుకంటే తల్లి సూర్యకాంతంలా తనను ఎప్పుడు కొట్టాలనుకున్నా.. రేలంగిలా తన తల్లికి అడ్డుతగిలి తనని రక్షిస్తాడు కాబట్టి. "నాన్నంటే... మా 'నాన్న'లా వుండాలి" అని పుష్ప వాదన.

○ ○ ○

"కాంతం.. కాంతం..." అంటూ మూలుగుతూ

## భక్తా! భయమూ!

దేముడి పటానికి అగరొత్తి తిప్పేసి
బొట్టుపెట్టుకుని, బొడ్లో కత్తో, కఠారో, గన్నో పెట్టుకు
'ధంధాకి బయలుదేరే గుండాలు, రౌడీలు
కోడిని కోస్తేనే 'హలాల్' చేసినపుడు
మనిషిని చంపే ముందు దండమేనా పెట్టద్దా మరి!
జనాలతో గుళ్ళు గోపురాలు
కిటకిటలాడిపోతున్నాయి
కోరికలు పెరిగి దేముడి వాటాలతో హుండీలు
నిండుతున్నాయి
పాపాలు పెరిగి పరిహారాలు పెరిగాయా
జనంలో ఆధ్యాత్మిక చింతన పెరిగిందా
అన్న భావాన్ని
జరుగుతున్న మారణహోమం పటాపంచలం
చేసింది!

-డి. కామేశ్వరి

ఇంట్లోకి ప్రవేశించాడు అప్పారావ్.

"ఏమండీ! ఏమైంది?" అంటూ గాబరాపడుతూ వచ్చి "డాక్టర్ దగ్గరకు వెళ్ళారుగా, ఏమన్నారు??" అడిగింది కాంతం.

"దేవుడు నన్ను పరీక్షిస్తున్నాడు కాంతం" నీరసంగా సమాధానమిచ్చాడు అప్పారావ్.

"పాప ఫంక్షన్‌కు పాతికవేలైపోయిందా... పోనీ మిగిలిన డబ్బుతో కనీసం 'స్కూటీ' అయినా కొని.. నీ కోరిక తీర్చాలనుకున్నాను కాంతం" అన్నాడు అప్పారావ్.

"పోనీలేండి... మీ ఆరోగ్యం కంటే స్కూటీ ఏం ముఖ్యం కాదు" అంటూ సముదాయించింది కాంతం.

"అది కాదు కాంతం... అసలేం జరిగిందంటే..." అని ఏదో చెప్పబోయాడు అప్పారావ్.

"మీరేం దిగులుపడకండి.. స్కూటీ ఇప్పుడు ఎందుకులెండి.. మీరేం టెన్షన్స్ మెదడులో పెట్టుకో వద్దు" అంటూ ధైర్యాన్ని నూరిపోసింది కాంతం.

"అది కాదు కాంతం... నేను చెప్పేది కాస్త సావధానంగా విను. నువ్వు టెన్షన్ పడొద్దు... నాకు కిడ్నీలో రాళ్ళు చేరాయట. అతి త్వరలో ఆపరేషన్ చేయించుకోవాలని డాక్టర్ చెప్పారు. ఆపరేషన్‌కు కనీసం ముప్పై వేలు ఖర్చు అవుతుంద"ని చావుకబురు చల్లగా చెప్పాడు అప్పారావ్.

ఈసారి పిడుగు కాంతం నెత్తిన పడింది. అది విని జలజలా కన్నీరు జారాయి కాంతం కంటి వెంట. ధైర్యం తెచ్చుకుని.. "వెధవ డబ్బు.. ఇప్పుడు కాకపోతే తర్వాత సంపాదించొచ్చు.. మీరు వెంటనే ఆపరేషన్ చేయించుకోండి" అంటూ చెప్పింది కాంతం.

○ ○ ○

మరుసటి రోజు...

"నాన్నా! నాన్నా!!" అంటూ ప్రవేశించాడు ముద్దుల కొడుకు నరేష్.

"ఏరా కన్నా!" అంటూ ముద్దుగా బదులిచ్చాడు అప్పారావ్.

"నాన్న! గుడ్ న్యూస్... నాకు ఇంజనీరింగ్ సీటు వచ్చింది" అన్నాడు.

"వెరీ గుడ్‌రా!" అంటూ ఉప్పొంగిపోయాడు అప్పారావ్.

"కానీ..." అంటూ నసిగాడు నరేష్.

"ఏంటి కన్నా?.. ఏమైంది?..." చెప్పు అని ప్రశ్నించాడు అప్పారావ్.

"ఏం లేదు డాడీ!... ఆ సీటుకు కనీసం నలభై వేలు డొనేషన్ కట్టాలి" అన్నాడు.

మళ్ళీ నెత్తిన పిడుగు పడింది. ఈసారి అప్పారావ్ పరిస్థితి 'కుడితిలో పడ్డ ఎలుక'లా... చావు తప్పి కన్ను లొట్టపోయినట్లయింది.

అప్పారావ్ మెదడులో ఎన్నో ఆలోచనలు సుడులు తిరుగుతున్నాయి. తన కొడుకు అప్రయోజకుడయితే తననూ, తన పెంపకాన్ని అందరూ విమర్శిస్తారు. కాబట్టి, ఎలాగైనా ఆ నలభైవేలు డొనేషన్ కట్టి తన కొడుకును ప్రయోజకుడుగా చేయాలి. అది తండ్రిగా నా బాధ్యత అని 'నాన్న' అంటేనే నాలా ఆలోచించాలని మిగిలిన పదివేల అప్పుకోసం ఫైనాన్స్ కంపెనీ వద్దకు పరుగు తీశాడు అప్పారావ్ తన కిడ్నీ ఆపరేషన్‌ను వాయిదా వేస్తూ.

■

## వలపు గేయం

ముళ్ళు లేని పూవని
ముచ్చటైన అందం నీదని
మురిసిపోయానే ఓ చెలీ!
మనసు పడ్డానే సఖీ
అలలు లేని సంద్రం నీవని
అందమైన రూపం నీదని
అందుబాటులో ఉంటావని
ఆశించానే నెచ్చెలీ!
పెళ్ళివరకు నిలిపిన మౌనం
ముచ్చటగొలిపిందే నాకు
ఆరు నెలలు గడవగానే
పెదవి కదిలించావే
చూపుల ముళ్ళను చురకత్తిగ చేశావే
మాటల తూపును మదిలో నాటావే
అల్లరి బాకులు గుండెలోన దింపావే.
నీ కనుసన్నలలోనే మెలగాలనీ
నీకే నే దక్కాలని / వలపు వలయం గీశావే
నలుగురికీ నను దూరం చేశావు
మన మనసులు ఒకటై
మన తనువులు ఒకటై
మనమిద్దరమొకటై / అందరినీ అలరించాలే
అందరినీ ఆదరించాలే.

-బీ. యార్